కళావిహీనం



చినవాల్తేరు పార్క్

- నిర్వహణకు నోచుకోని చినవాల్తేరు పార్క్
- గోతులమయంగా ఆటమైదానం
- పాడైన ఆట వస్తువులు
- పట్టించుకోని అధికారులు

ఏయూక్యాంపస్: ఉద్యానవనం కళ తప్పింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేసిన చినవాల్తేరు పార్క్ నేడు నిర్వహణలోపంతో వెలవెలపోతోంది. ఆట మైదానం, ఆట వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. సాయంత్రం వేళల్లో పార్క్‌కు వెళ్లే చిన్నారులకు నిరాశే ఎదురవుతోంది.

పెచ్చులూడిన మైదానం

పార్క్‌లోని ప్రవేశించగానే కనిపించే షటిల్ కోర్టు పెచ్చులూడిపోయి వెక్కిరిస్తోంది. పిల్లలకు దెబ్బలు తగలకుండా ప్రత్యేకమైన మెటీరియల్‌తో దీనిని నిర్మించారు. ప్రస్తుతం కోర్ట్ అంతా పెచ్చులు ఊడిపోయి కళావిహీనంగా మారింది. దీని నిర్వహణ చూసే వారు లేక ఆటకు పనికిరాకుండా పోయింది.


పెచ్చులూడిన క్రీడా మైదానం

క్రీడా పరికరాలు శిథిలం

పార్క్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ ఉన్న మూడు జారుడు బల్లలు రంధ్రాలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ ఆడితే చిన్నారులు గాయాల పాలవడం తథ్యం. ఆడుకోవడానికి ఎంతమాత్రం వీలు లేని విధగా ఇక్కడి ఆట వస్తువులు ఉన్నాయి.


దెబ్బతిన్న జారుడు బల్లలు


విరిగిన ఆట వస్తువులు

అడవిని తలపించే పరిసరాలు...


అడవిని తలపిస్తున్న పరిసరాలు

పార్క్‌ను అభివృద్ధి చేసిన సమయంలో వివిధ రకాల మొక్కలను రహదారి పక్కన నాటారు. కాలానుగుణంగా వీటికి తగిన ప్రూనింగ్ చేయాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా సిబ్బంది దృష్టి సారించడం లేదు. దీంతో ఇవి పెరిగిపోయి చిన్నపాటి చిట్టడవిని తలపిస్తున్నాయి. సాయంత్రం వేళ దోమల బెడద కూడా ఉంది. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో చిన్నారులను తీసుకురావడానికి పెద్దలు సైతం ఆలోచిస్తున్నారు. పార్క్‌లో మొక్కలకు ప్రూనింగ్ చేసి సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. అదే విధంగా పార్క్‌లో గతంలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లు నేడు నిరుపయోగంగా మారాయి. వీటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తే వ్యర్థాలను వేయడానికి, సేకరణకు సులభంగా ఉంటుంది.

ఆకతాయిలకు నిలయం

రాత్రి వేళల్లో పార్క్ ప్రాంగణం ఆకతాయిలకు నిలయంగా మారుతోంది. దీనికి నిదర్శనంగా పార్క్ ప్రాంగణంలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. రాత్రివేళలలో పార్క్ గోడ దూకి బయటి వ్యక్తులు, ఆకతాయిలు ప్రవేశించి మద్యం సేవిస్తున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాలి.


పార్క్ ప్రాంగణంలో మద్యం సీసాలు

క్లుప్తంగా

తీరంలో కూలేందుకు సిద్ధంగా..


సబ్‌మెరైన్ వెనుక భాగంలో కోతకు గురైన విద్యుత్ స్తంభం

ఏయూక్యాంపస్: సముద్ర తీరంలో కెరటాల ఉధృతికి కోత తీవ్రమవుతోంది. దీంతో తీరంలో ఉన్న విద్యుత్ స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కురుసుర సబ్‌మెరైన్ వెనుక భాగంలో స్తంభాల పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. కొన్ని నెలలుగా కురుసుర ముందు, వెనుక భాగంలో తీరంలో కోత పెరిగిపోయింది. ఇప్పటికే పలు కొబ్బరి చెట్లు కూడా కూలిపోయాయి. ఈ క్రమంలో బీచ్‌లో రాత్రివేళల్లో పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసిన ఈ భారీ విద్యుత్ దీపాల స్తంభాలకు ముప్పు పొంచి ఉంది. కెరటాల తీవ్రతతో కోత మరింత పెరిగితే ఈ విద్యుత్ స్తంభం కూలే అవకాశం ఉంది. ఇప్పటికే స్తంభం క్రింది భాగంలో సగం వరకు కోతకు గురైంది. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఏయూ విద్యార్థులు


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: న్యూ ఢిల్లీలో జనవరి 26వ తేదీన నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకలకు ఇద్దరు ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ఆహ్వానం అందింది. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బీబీఏ చదువుతున్న డి.బుచ్చయ్య నాయుడు, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో చదువుతున్న డి.హర్షిత ఈ వేడుకల్లో ఆహ్వానితులుగా పాల్గొంటున్నారు. వీరు తమ తల్లిదండ్రులతో కలిసి గణతంత్ర దినోత్సవాన్ని వీక్షించడానికి న్యూఢిల్లీ వెళ్లనున్నారు. వారిని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య హరనాథ్ పాల్గొన్నారు.

ఏయూ సౌత్ జోన్ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక


క్రీడాకారులతో ఆచార్య విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.విజయ మోహన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ ఆచార్య ఎ.పల్లవి అభినందించారు. ఆచార్య ఎస్.విజయ్ మోహన్ మాట్లాడుతూ సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ మహిళా క్రికెట్ పోటీలు ఈ నెల 23 నుంచి 27 వరకు మైసూర్ విశ్వవిద్యాలయంలో జరుగుతాయన్నారు. ఏయూ క్రికెట్ జట్టుకు వివిధ కళాశాలల నుంచి 16 మంది క్రీడాకారిణులను ఎంపిక చేసినట్లు తెలిపారు. జట్టు మేనేజర్, కోచ్‌లుగా ఎస్.కవిత, హారిక వ్యవహరిస్తారన్నారు.

మహిళల హక్కులు, లింగవివక్షపై అవగాహన

మహారాణిపేట: మహిళల హక్కుల పరిరక్షణ, లింగ వివక్షపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లకు డిస్ట్రిక్ట్ సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జడ్జి ఎం.వి. శేషమ్మ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో లీగల్ అవేర్‌నెస్ అంశాలు, పోక్సోచట్టం, లింగ నిర్ధారణ గురించి వివరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ స్కానింగ్‌పై పీసీపీఎన్‌డీటీ లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం గురించి తెలియజేశారు.నోడల్ అధికారి జి.శారదా దేవి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వర రావు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరాలు ప్రారంభం


ఉచిత పశు వైద్య శిబిరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, పశు వైద్యాధికారులు

ఆరిలోవ: జిల్లాలో ఉచిత పశు వైద్య శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు ఈ నెల 31 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా శిబిరాల పోస్టర్‌ను పశువైద్యాధికారులతో కలసి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాడి రైతులు, కోళ్ల తదితర జీవాలు పెంపకందార్లు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 142 వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలలో పశువులకు సాధారణ చికిత్సలు, శస్త్ర చికిత్సలు, గర్భకోశ చికిత్సలు చేయడంతో పాటు నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని చెప్పారు. పాడి రైతులు, కోళ్లు, తదితర జీవాల పెంపకందార్లకు ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి, అవగాహన కల్పిసామ్తున్నారు.

మొదటిరోజు 16 శిబిరాలు

మొదటి రోజు జిల్లాలో పలు గ్రామాలలో 16 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా శిబిరాలలో 636 పశువులకు చికిత్సలు, 117 పశువులకు గర్భకోశ పరీక్షలు, 1,626 పశువులకు, మరో 3,651 కోళ్లు, తదితర జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. 1,234 పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పశు వైద్య శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్, సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఎం.ప్రసాద రావు, డాక్టర్ శ్రీనుబాబు పాల్గొన్నారు.

22న రామకృష్ణాపురంలో శిబిరం

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా రామకృష్ణాపురంలో ఈ నెల 22న ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చినగదిలి మండల పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఉచిత పశువైద్య శిబిరాలలో భాగంగా మండలం పరిధిలో మూడు చోట్ల శిబిరాలు జరుగుతాయన్నారు. వాటిలో 22న రామకృష్ణాపురం, 24న పన్నెండో వార్డు పరిధి తోటగరువు పశు వైద్యశాల, 27న ఎనిమిదో వార్డులో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఆయా శిబిరాలు ప్రారంభమవుతాయన్నారు.

జోన్-3 పీజీఆర్ఎస్‌కు నాలుగు వినతులు


పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న జోన్-3 జెడ్సీ శివప్రసాద్

సీతమ్మధార: నగరంలోని ఆశీలమెట్టలో గల జోన్-3 కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి నాలుగు వినతులు అందాయి. జెడ్సీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కర రావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వాణి, టీపీఎస్ నారాయణరావు, యూసీడీ ఏపీడీ ఎల్.రాము తదితరులు పాల్గొన్నారు.

కేర్‌లో అరుదైన రోబోటిక్ సర్జరీ


రోబోటిక్ సర్జరీ వివరాలను మీడియాకు తెలుపుతున్న డాక్టర్ బిశ్వబసు దాస్

ఆరిలోవ: స్థానిక హెల్త్‌సిటీలోని కేర్ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన రోబోటిక్ శస్త్ర చికిత్స చేశారు. ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బిశ్వబసు దాస్, వైద్యుల బృందం రోగితో కలసి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. డాక్టర్ బిశ్వబసు మాట్లాడుతూ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో రోబోటిక్ టోటల్ ప్రోక్టోకోలెక్టమీ ద్వారా రాష్ట్రంలోనే మొదటిసారిగా శస్త్ర చికిత్స విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఒడిశాలోని డీగ్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల మత్స్యకార యువకుడు చిన్నయ్య మూడేళ్లుగా పెద్దప్రేగు కణితితో బాధపడుతున్నాడన్నారు. రెండు వారాల క్రితం కేర్ ఆస్పత్రిలో సంప్రదించగా, వైద్య పరీక్షలు నిర్వహించి కోత లేకుండా రోబోటిక్ సర్జరీ చేసి పాడైన పెద్దప్రేగు భాగాన్ని తొలగించామన్నారు. అతి తక్కువ సమయంలో ఆయన కోలుకొన్నట్లు పేర్కొన్నారు. కోత ద్వారా ఈ సర్జరీ చేస్తే కోలుకునేందుకు 2 నుంచి 3 నెలలు పడుతుందన్నారు. రోబోటిక్ ద్వారా పరికరాలను ఉపయోగించి సర్జరీని సులువుగా చేసినట్లు వెల్లడించారు. సర్జరీ చేసిన వారంలో రోగి కోలుకున్నాడన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఇలాంటి చికిత్స రాష్ట్రంలో ఇదే మొదటిసారన్నారు. ఆస్పత్రి సీవోవో మయాఖ్ చౌదరి మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోబోటిక్ సర్జరీ విజయవంతంగా చేసిన వైద్య బృందానికి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు


జెడ్సీ శివప్రసాద్

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాలలో ఈ నెల 21వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. జోనల్ కార్యాలయంలో ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. పుట్టినప్పటి నుంచి ఇంతవరకు ఆధార్ నమోదు కాని పిల్లల కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రులు తమ ఆధార్‌కార్డులతో ఈ సచివాలయాలలో ఉదయం 10.30 గంటలనుంచి సాయంత్రం 4 గంటలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకోవాలని కోరారు.

- తూర్పు నియోజకవర్గ పరిధి 17వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్-1 నేతాజీ పార్కులో గల 106 సచివాలయంలో, మద్దిలపాలెంలోని 117 సచివాలయంలో శిబిరాలు జరుగుతాయన్నారు.
- ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125 సచివాలయంలో, పాత రేసపువానిపాలెంలోని 138 సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.
- దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143 నంబర్ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరం జరుగుతుందన్నారు.

అలరించిన 'శివోహం'



త్యాగరాజ కృతి ఆలపిస్తున్న కళాకారులు


మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధనోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో వీనులవిందుగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఏర్పాటు చేసిన శివోహం కార్యక్రమం అలరించింది. కాకినాడ, హైదరాబాద్, బెంగళూరు, శ్రీకాకుళం, విజయనగరం నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. విజయ్ విపంచి సంస్థ ప్రతినిధి డాక్టర్ రామవరపు మాధురీ దేవి నేతృత్వంలో జరిగిన శివోహం కార్యక్రమంలో త్యాగరాజ స్వామి శివుడి మీద రాసిన ఆరు కీర్తనలకు 16 మంది శిష్యులు 2 వేదికలమీద కూర్చుని అద్భుతంగా గానం చేశారు. నాలుగో రోజు కార్యక్రమంలో 226 మంది పాల్గొన్నారని త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు.

ఆదమరిచారా.. అంతే..!


ముడసర్లోవ వెనుక రోడ్డు మధ్యలో విరిగిన ఇనుప స్తంభం

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్డులో ఓ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్లలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా జీవీఎంసీ అధికారులు పలుచోట్ల అడ్డంగా గేట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన గేటు కొద్దినెలల క్రితం ఓ కారు ఢీకొనడటంతో విరిగిపోయింది. దీంతో ఇక్కడ ఇనుప రాడ్లు రోడ్డు మధ్యలో ఉండిపోయి, ప్రమాదకరంగా మారాయి. రాత్రివేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు దీనిని గమనించకపోవడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వాటిని తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నీటి వృథా అరికట్టలేరా?


ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు


పైపు నుంచి లీకవుతున్న నీరు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులోని పలు ప్రాంతాల్లో నీరు వృథాగా పోతోంది. దీనికి అడ్డుకట్టవేసేవారు లేకపోవడంతో వందల లీటర్ల నీరు నేలపాలవుతోంది. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియంలో నిర్మించిన భవనంపై ఏర్పాటు చేసిన నీళ్ల ట్యాంకులు నిండి నీరు పొంగి పొర్లుతోంది. నీరు వృథా కావడంతో పాటు ఆ భవనం సైతం నీటికి నాని దెబ్బతింటోంది. అదే విధంగా విండీస్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న కొబ్బరి వనాన్ని ఆనుకుని వెళ్తున్న నీటి పైపునకు రంధ్రం పడడంతో నీరు వృథాగా పోతోంది. దీనికి మరమ్మతు చేసి నీటి వృథాను అరికట్టాల్సి ఉంది.



ఆర్కే బీచ్‌కు సోమవారం ఒకరు పెంపుడు కుక్కను తీసుకురావడంతో సందర్శకులు హడలిపోయారు. అటు వెళ్లాలంటే కెరటం, ఇటు చూస్తే శునకం ఉండడంతో బెంబేలెత్తిపోయారు. వాస్తవానికి బీచ్‌కు పెంపుడు జంతువులను తీసుకురాకూడదనే నిబంధన ఉంది. కానీ ఆ నియమాలేవీ పట్టించుకోకుండా కొందరు ఇలా తీసుకువచ్చి సందర్శకులను ఇబ్బంది పెట్టడం సరికాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆగని తాబేళ్ల మృత్యుఘోష



విశాఖ సాగరతీరంలో తాబేళ్ల మృత్యుఘోష ఆగడం లేదు. రోజూ ఏదో తీరంలో అవి కనిపిస్తూనే ఉన్నాయి. సోమవారం కూడా ఆర్కే బీచ్‌కు తాబేలు మృత కళేబరం కొట్టుకు వచ్చింది. దీంతో జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. తాబేళ్ల సంరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

వ్యక్తికి పాము కాటు


రాఘవేంద్రతో మాట్లాడుతున్న దుర్గారావు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని పందిమెట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్న పి.రాఘవేంద్ర అనే వ్యక్తి పాము కాటుకు గురయ్యాడు. ఆదివారం సాయంత్రం రాఘవేంద్ర ఇంటి నుంచి బయటికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. వెంటనే రాఘవేంద్రను ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు రాఘవేంద్రను సోమవారం పరామర్శించారు. రాఘవేంద్ర ఇంటి చుట్టూ ఉన్న మొక్కలు, రాళ్లను జీవీఎంసీ సిబ్బందికి చెప్పి తొలగిస్తామన్నారు.